స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

కలెక్టర్‌ను కలిసిన విజయ డెయిరీ డీడీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీడీ

జనగామ: జనగామ విజయ పాల శీతలీకరణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎస్.గోపాల్‌సింగ్ గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం విజయ డెయిరీ కార్యకలాపాలపై కలెక్టర్‌కు డీడీ వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన చేనేత అవార్డు గ్రహీత



మొక్కను అందజేస్తున్న విజయప్రకాశ్

జనగామ రూరల్: ఈనెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన చేనేత దినోత్సవంలో జిల్లాలోని వీవర్స్ కాలనీకి చెందిన న్యాలపల్లి విజయప్రకాశ్ కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విజయప్రకాశ్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా అభినందించారు. జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు చాడేశ్వరి, చేనేత కార్మికులు శ్రీరామ్ శ్రీనివాస్, బిర్రు సత్యనారాయణ, రచ్చ కృష్ణమూర్తి, వంగ యుగంధర్, బొంతపల్లి చిన్న, సమ్మయ్య ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న నాయకులు

జనగామ: దేశంలో 2024లో జరిగిన జనరల్ ఎన్నికలతో పాటు రానున్న బీహార్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో క్యాండిల్ నిరసన ర్యాలీ చేపట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, బాలరాజు, ప్రకాష్, మసూద్, నరేష్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెహ్రూపార్కు నుంచయి ఆర్టీసీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ ఓట్ల దొంగలు గద్దె దిగండి అనే నినాదంతో ఏఐసీసీ పిలుపు మేరకు ప్రజలను చైతన్యం చేసేందుకు నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



జనగామ రూరల్: మాట్లాడుతున్న రమేశ్



కొడకండ్ల: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్రలో విద్యార్థులు



బచ్చన్నపేట: జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు



పాలకుర్తిలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మండల కేంద్రాల్లో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి దేశభక్తిని చాటారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ భారతీయులంతా ఒక్కటే అని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. దేశ సమైక్యత కోసమే తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కేవీఎల్ఎన్ రెడ్డి, శశిధర్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, ఉపేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పొక్లెయినర్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం శివారులో ఇప్పగూడెం–ఘన్‌పూర్ ప్రధాన రోడ్డు వెంట ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపునీరు, డ్రెయినేజీ నీరు సమీపంలోని కుంటలోని వెళ్లేలా ఉన్న పెద్ద మోరీ వెంట మొరం మట్టితో పాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉండటంపై 'మోరీ ఇలా.. నీరు వెళ్లేదెలా' శీర్షికన ఈనెల 8వ తేదీన సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. గురువారం పొక్లెయినర్‌తో మోరీ దిగువన ఉన్న మొరం మట్టిని చదును చేయడంతో పాటు ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించారు. దాంతో మోరీ నుంచి కుంటలోకి నీరు సాఫీగా వెళ్తుండగా రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీడికల్‌లో తాగునీటి శాంపిళ్ల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..



తాగునీటి శాంపిళ్లను సేకరించి పరీక్షిస్తున్న అధికారులు

లింగాలఘణపురం: జీడికల్‌లో తాగునీరు కలుషితంపై గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్ ఆధ్వర్యంలో శాంపిళ్లను సేకరించి పరీక్షించారు. ఈ నెల 13న జీడికల్‌లో తాగునీరు కలుషితం అనే సాక్షి కథనానికి అధికారులు స్పందించి చెరువు నీటిలో మునిగిపోయిన బోరు బావులోని నీటిని ఆపివేసి ఓహెచ్ఎస్ఆర్‌ను శుభ్రం చేసి బ్లీచింగ్ వేశారు. శాంపిల్స్ సేకరించి పరీక్షించి ఎలాంటి ప్రమాదంలేదని తెల్పి చెప్పారు. కార్యక్రమంలో ఏఈ కావ్య, పంచాయితీ కార్యదర్శి మల్లేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఉన్నారు.

బాల్యమిత్రుడి కూతురు వివాహానికి చేయూత



సాయం అందజేస్తున్న స్నేహితులు

రఘునాథపల్లి: బాల్య మిత్రుడి కూతురు వివాహానికి స్నేహితులు చేయూతనందించారు. వివాహం సందర్భంగా గురువారం రూ.90 వేల సాయం అందజేశారు. రెండేళ్ల క్రితం జాఫర్‌గూడెం గ్రామానికి చెందిన స్నేహితుడు బండి వెంకటేశ్వర్లు ఆకస్మిక మృతి చెందాడు. కొన్నాళ్లకే వెంకటేశ్వర్లు భార్య రజిత అనారోగ్యంతో మరణించగా ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. కాగా, ఖిలాషాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1987–88 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు తోడ్పాటునందించారు. జనగామలో స్నేహితుడి పెద్ద కూతురు అంజలి వివాహం సందర్భంగా అండగా నిలిచి రూ.90 వేలు అందజేసి స్నేహబంధం చాటుకున్నారు. బాల్య మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి..



సాయం అందజేస్తున్న మిత్రులు

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన మాదరాజు నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.25 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎదులాపురం మదన్‌మోహన్, మంచాల సంపత్, బైరి రవి, ఇల్లందుల రాజు, రొడ్డ రాజు, అన్నెబోయిన సంపత్, సముద్రాల రాజు, కొత్వాల సతీష్ ఉన్నారు.

'కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి'



నిరసన తెలుపుతున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ బహుళ జాతి శక్తులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాపర్తి సోమయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి లింగనబోయిన కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు కత్తుల రాజు, నాయకులు మంద మొగిలి, మల్లయ్య, రాజు, అశోక్, సంపత్, మల్లారెడ్డి, నర్సిరెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఢిల్లీ వేడుకలకు నెల్లుట్ల కార్యదర్శి



ఢిల్లీలో పంచాయితీ కార్యదర్శులు

లింగాలఘణపురం: కేంద్ర ప్రభుత్వం ఎర్రకోటలో జరిగే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్రం నుంచి ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను ఆహ్వానించగా వీరంతా గురువారం ఢిల్లీకి చేరుకున్నారు. జిల్లా నుంచి లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం నుంచి జె.షర్మిల, మహబూబ్‌నగర్ నుంచి వి.శ్రీనివాస్, గద్వాల్ జోగులాంబ జిల్లా నుంచి ఎం.దస్తగిరి, పెద్దపల్లి నుంచి ఆర్.రాంకిశోర్, రంగారెడ్డి జిల్లా నుంచి వైవీ రాజు ఉన్నారు. పలు రంగాల్లో ఉత్తమ అవార్డులు పొందిన జీపీల నుంచి వీరిని కేంద్రం ఆహ్వానించింది.

పరామర్శ

జనగామ: పట్టణం 2వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు ఎం.సునీల్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇవ్వడంతో పాటు నాయకుల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. నాయకులు తదితరులు ఉన్నారు.

ఎంపిక

జనగామ రూరల్: ఆర్‌టీఏలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జనగామకు చెందిన మహమ్మద్ సాదిక్ గురువారం యాంటీ నార్కోటిక్ ట్రైనర్‌గా (ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్) ఎంపికయ్యారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ఎంపికయ్యారు. డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సాదిక్ పిలుపునిచ్చారు. తన ఎంపికకు సహకరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్‌ను తలపిస్తున్న కవర్‌షెడ్ ప్రాంగణం

జనగామ: ఇటీవల అడపదడపా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కొత్త కవర్ షెడ్డు ప్రాంగణంలో వరద నీరు నిలిచి స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తోంది. నీరు దిగువ ప్రాంతానికి వెళ్లే పరిస్థితి లేక ఒక్కచోటే నిలువడంతో క్రిమికీటకాలు రాజ్యమేలుతున్నాయి. అందులోనే పిల్లలు ఆడుతూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

వచ్చిందన్నారు.. పోయిందంటున్నారు

బచ్చన్నపేట: ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇల్లు వచ్చిందని ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి భూమిపూజ చేశాక ఆ ఇల్లు రద్దయిందంటున్నారని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామానికి చెందిన లబ్ధిదారు జలగడుగుల భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినట్లు మే 30వ తేదీన ఉత్తర్వుల పత్రం అందించారని తెలిపారు. అనంతరం గ్రామంలో తమకున్న స్థలంలో కాంగ్రెస్ నేతలు భూమిపూజ చేసి ఫొటోలు దిగారని, తీరా చూస్తే రిజెక్టు జాబితాలో పేరు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గృహనిర్మాణ శాఖ అధికారులు పరిశీలించి ఇల్లు కట్టుకునేలా చూడాలని కోరారు.

సామూహిక అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

జనగామ రూరల్: పట్టణంలోని 18 సంవత్సరాల యువతిపై సామూహిక అత్యాచారం చేసిన పదిమంది వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఐద్వా, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఆఫీస్ ఎదురుగా సిద్దిపేట బస్‌స్టాప్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అహల్య మాట్లాడారు.

పుస్తె మట్టెల అందజేత

జనగామ రూరల్: గానుగుపహాడ్ గ్రామానికి చెందిన వంజ వెంకటయ్య పెద్ద కూతురు సంధ్య వివాహానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లుట్ల ప్రీతం సహకారంతో గురువారం పెళ్లి మండపంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మహిపాల్ పుస్తె, మట్టెలను అందజేశారు. కన్నెబోయిన నరేష్, కూకట్ల చింటు, గిరబోయిన రాజెష్, దడిగే సిద్దులు, కన్నెబోయిన బాలారాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

స్టేషన్‌ఘన్‌పూర్: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఇప్పగూడెం గ్రామానికి చెందిన మంద మహేశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో బాధితురాలికి సీఎం సహాయనిధి నుంచి రూ.2.5లక్షల ఎల్ఓసీ మంజూరీ చేశారు. ఈ మేరకు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో బాధితురాలి తండ్రి మల్లయ్యకు ఎల్‌ఓసీని గురువారం అందించారు.

'ప్రజాస్వామ్యయుతంగా గెలవాలి'

బచ్చన్నపేట: ఎన్నికల్లో ప్రజాస్వామ్య యుతంగా గెలవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డు ప్రవీణ్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ఏపీలోని పులివెందుల పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా జెడ్పీటీసీ ఎలక్షన్లను జరపడం అప్రజాస్వామ్యమన్నారు. మంత్రి కూడా పోలింగ్ బూత్‌కు వెళ్లి ఇతర ప్రాంతాల నుంచి ప్రజలను రప్పించి ఓట్లు వేయించారని అన్నారు. టీడీపీ అభ్యర్థి అక్రమ దారిలో గెలిచారని, ప్రజాస్వామ్య బద్ధంగా గెలవాలని అన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఓటరు జాబితాను సవరణను చేస్తున్నట్లు వీఓఏలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఐకేపీ ఏపీఎం మాదారపు రవి ఆదేశాల మేరకు ఐకేపీ కార్యాలయంలో 60 సంవత్సరాల పైబడిన వారిని ఒక జాబితాగా, లోపు ఉన్న వారిని మరో జాబితాగా తయారు చేస్తున్నామని చెప్పారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

జనగామ రూరల్: గత ప్రభుత్వం నర్మెట మండలం వెల్దండలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై హైకోర్టును ఆశ్రయించిన అర్హులైన నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. నాయకులు తదితరులు ఉన్నారు.

పోచమ్మతల్లికి పూజలు

జఫర్‌గఢ్: కూనూర్ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నివాళి

చిల్పూరు: వంగపల్లి గ్రామానికి చెందిన హెచ్ఎం వరదారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గ్రామానికి చేరుకుని మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ పశువుల కాపరిగా ఉన్న తనకు విద్యాబుద్ధులు నేర్పి ఇంతవాన్ని చేసింది వరదారెడ్డి అని అన్నారు.

'మోసపూరిత వాగ్దానాలతో దగా పాలన'

దేవరుప్పుల: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణాత్మకంగా తెలంగాణ ప్రజలను దగా చేస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భార్గవి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ సీనియర్ యువజన నాయకుడు పానుగంటి కృష్ణ, జయశ్రీ వివాహ మహోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎం కె.రాజ్యలక్ష్మి అన్నారు. కోమటిగూడెం సబ్‌సెంటర్ పరిధిలోని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అక్కపెల్లిగూడెంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పలువురికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు అందించారు.

పాలకుర్తి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిద్దార్థ రెడ్డి అన్నారు. మండలంలోని శాతపురం, మల్లంపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దేవరుప్పుల: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందడంతో మండల కేంద్రంలో తీవ్ర విషాదం అలుముకుంది. వివరాళ్లోకెళ్తే.. మండల కేంద్రానికి చెందిన జోగు భీమయ్య (57) నాలుగు దశాబ్దాల నుంచి ఎడ్లబండిని నమ్ముకునే జీవించే క్రమంలో నేటికీ నిత్యం మండల కేంద్రంలో ప్రజావసరాలకు ఈయన బండి దిక్కుగా మారింది. ఈ నేపథ్యంలోనే భీమయ్య బోనాల పండుగ సందర్భంగా పాలకుర్తి మండలం వావిలాలలోని అత్తగారి ఇంటికి బుధవారం వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందారు. పాలకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భీమయ్య మృతదేహాన్ని గురువారం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేశారు. కాగా, ఇటీవలనే కొడుకు అనారోగ్యంతో మృతి చెందగా ప్రమాదవశాత్తు భీమయ్య మృతితో మగదిక్కు లేకపోవడంతో కూతురు రేణుక తలకొరివి పెట్టడం పలువురిని కలిచివేసింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

లింగాలఘణపురం: బండ్లగూడేనికి చెందిన క్లోం రామయ్య (35) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురై ఎంజీఎంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. పదేళ్ల క్రితం మద్యానికి బానిసై భార్యను వేధించడంతో రాజయ్యను వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యం తాగుతూ రెండు రోజుల క్రితం స్పృహ కోల్పోయి ఇంట్లో ఉండడంతో సమీపంలోని వారు గమనించి 108కు సమాచారం అందించగా అంబులెన్స్‌లో జనగామ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యం చేస్తుండగా పరిస్థితి విషమించడంతో గురువారం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మద్యం తాగాడని సమీపస్తులు చెప్పడంతో పురుగుల మందుతాగి ఉంటాడని గమనించి ఆస్పత్రికి తరలించడంతో మద్యం తాగి మృతిచెందిట్లు వైద్యులు గుర్తించారని ఎస్సై వివరించారు.

ఘనంగా బోనాలు

బచ్చన్నపేట/దేవరుప్పుల: బచ్చన్నపేట, దేవరుప్పుల మండలాల్లో గ్రామస్తులు బోనాల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.